ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక: 9-5-2003

# ప్రియమైన శత్రువు

ఓ తెల్లవారుజామున...

అందులో శీతాకాలం...

ఫోను మోగితే, నాకు చెడ్డ చిరాకు. ఫోను చేసిన వాడిని ఎదురుగా ఉంటే హత్య చెయ్యాలన్నంత కోపం వస్తుంది.

ఒకసారి, రెండుసార్లు ఫోను ఆగకుండా మోగుతుంటే, ఫోను తీశా.

అవతల చంద్రం గొంతు.

"ఒరేయ్... నేను రా! ఇప్పుడే బస్సు దిగా. డబ్బుల్లేవు. నీ వున్నావు గదా - ఆటోలో వస్తున్నా" అని ఫోను పెట్టేశాడు.

◆ ◆ ◆

చంద్రం అంటే నా చిన్ననాటి స్నేహితుడు. ఇలా ఎందుకొచ్చాడు? డబ్బుల్లేక పోవడమేమిటి?

నాకేం అర్థం కాలేదు. మళ్ళీ నిద్ర పోదామంటే, నిద్ర రాలేదు.

వెధవకేమైంది? మద్రాసులో రెండు మేడలు, నాలుగు కార్లు, మందీ మార్బలం, పెద్ద సినిమా నిర్మాత, దర్శకుడు. వాడిలా ఎందుకొచ్చాడో?

చంద్రం అందగాడు. అంతేకాదు - అసాధ్యుడు కూడా.

వాడి సాహసం, చొరవ, తెంపరితనం గమనిస్తే ఆశ్చర్యమేస్తుంది. మంచి మాటకారి.

ఓ రోజు... ముప్ఫయ్యేళ్ళ క్రితం... లాగు, చొక్కా, భుజాన ఓ గుడ్డసంచితో నా గది తలుపు తట్టిన చంద్రం...

"ఒరేయ్! మా నాన్న... నీ దారి నువ్వు చూసుకో అని ఇంటి నుండి పంపాడురా. నువ్వే నన్ను ఆదుకోవాలి" అంటే... సరే అన్నా.

నే దారి చూపలా. చూపేదాకా చంద్రం ఆగలేదు. అదే వాడి గొప్పతనం.

ఎదురింటి మేడమీదున్న బాలవితంతువుకి లైను వేశాడు. ఆమెకు ముప్ఫయ్యేళ్ళు. అందగత్తె. అంతేకాదు - ఆమె భర్త తాలూకు ఆస్తి చాలా ఉంది. వీడేమో నూనూగు మీసాలొస్తున్నవాడు. ఆమె కంటే చిన్నవాడు.

ఏం జరిగిందో, ఎలా జరిగిందో... ఓ రోజు చంద్రం, ఆ అమ్మాయి... పేరు పద్మావతి... మాయమయ్యారు. పద్మావతి అన్నలు, తమ్ముళ్ళు, బంధువులు, కొంతమంది రౌడీలు నా గది మీద కొచ్చారు.

"ఏడీ... వాడు?"

"వాడు, వీడు తోడుదొంగలు."

"నా కొడుకు... వీడ్ని తంతే వాళ్ళ జాడ తెలుస్తుంది"

"లంగలోళ్ళు... ఆస్తి ఉందిగదాని పిల్లను లేపుకెళ్ళాడు"

ఇలా కేకలు, అరుపులు, రాద్ధాంతం, బూతులు, బెదిరింపులు.

నేను దోషిలా తల వంచుకున్నా. చంద్రం జాడ నాకు తెలియదు... నిజం. తెలుసుకుందామని ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

గది మారా - అక్కడ రోజూ బెదిరింపులు భరించలేక.

ఉద్యోగంలో మునగానాం, తేలానాం. రోజులు గడుస్తున్నాయి.

నా పెళ్ళి, పిల్లలు, జబ్బులు, బదిలీలు..ఇలా పేడ పురుగులా బతుకుతున్న నాకు...

ఓ రోజు చంద్రం ప్రత్యక్షమయ్యాడు. సిల్క్ లాల్చీ, లుంగీ, గిరజాల జుత్తు, మెడలో బంగారపు గొలుసు, వేళ్ళకు వజ్రాల ఉంగరాలు..

"నేనురా, చంద్రాన్ని" అంటే గాని ఆ ఖరీదైన మనిషి ఎవరో గుర్తించడం సాధ్యం కాలేదు. అంతగా మారాడు.

"ఇన్నాళ్ళు... మద్రాసులో నేను, పద్మ ఉన్నాం, మర్చిపొయ్యా.. నాకో కొడుకు. మద్రాసు రారా"

"ఏం చేస్తున్నావ్?"

"పద్మకున్న ఆస్తి అమ్మేశాం. దాంతో ఇల్లు కొన్నాం. డబ్బు బ్యాంకులో వేశాం. నేను ఊరికే ఉండడం దేనికని సినిమాలకు పెట్టుబడి పెడుతున్నా... అసలు అలాగే ఉందిలే" అన్నాడు నవ్వుతూ.

ఆ రాత్రి ఖరీదైన హోటల్లో మందు, విందు.

మా పిల్లలకు సైజుల వారీ గుడ్డలు, నాకూ, మా ఆవిడకూ గుడ్డలు. పిల్లలకు బొమ్మలు, స్వీట్లు - అదిగాక కొంత డబ్బు నా జేబులో కుక్కి, "ఇదంతా నీ చలవరా" అని కారులో ఇంట్లో దింపాడు.

చంద్రం దాతృత్వానికీ, ఓనాటి స్నేహితుడనీ నన్ను గుర్తుంచుకున్నందుకు, నాకో ఖరీదైన మిత్రుడున్నందుకు అప్పుడప్పుడు కించిత్తు గర్వంగా ఉండేది.

అధాటుగా రావడం, సినిమా కబుర్లు చెప్పడం వాడి కలవాటు.

నేను ఆశ్చర్యంగా వాడి మాటలు వినడం, డబ్బులో ఎంతో ఎత్తు కెదిగిన చంద్రాన్ని ఆశ్చర్యంగా చూడడం తప్ప నోరు తెరిచి ఇది కావాలని ఏనాడూ అడగలేదు.

"ఊరికే కంచిగరుడ సేవ చెయ్యడం దేనికీ..వచ్చినప్పుడల్లా పార్టీలు, అర్ధరాత్రీ అపరాత్రీ రావడం, ఇంతేనా? స్థలం కొనాలనో, పిల్లాడికి చదువుకనో డబ్బు అడగరాదూ! ఊరికే కాదులెండి - మీరేదో కథలూ, నవలలూ రాస్తారుగా.. అవి కొని సినిమా తియ్యమనండి. డబ్బు ఇవ్వమనండి" - ఇదీ మా ఆవిడ అభిప్రాయం - కోరిక కూడా!

"ఒరేయ్! సినిమా ఓ మాయా ప్రపంచంరా. పొగడ్తలు, అవసరానికి వాడుకోవడం, పై కొచ్చేదాకా వాడి వెంట పడడం, అబ్బే... నువ్వొద్దురా. ఇమడలేవు. హాయిగా ఉద్యోగం చేసుకో" - ఇదీ చంద్రం సలహా!

ఏళ్ళు గడిచాయి. నా పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. ఆడపిల్లల పెళ్ళిళ్ళూ అయ్యాయి. ఏ శుభకార్యానికి చంద్రం రాలేదు. కాని, బహుమతులు పంపేవాడు.

వాడి కొడుకు పెళ్ళి కెళ్ళా. వందల మందిలో నేనొకడిని. అంతా సినిమా జనం. వియ్యాలవారు వజ్రాల వ్యాపారస్తులు.

గ్లామరు, బంగారం, కార్లు, సూట్లు, బొకేలు..వీటి మధ్య నేను ఒంటరిగానే ఉండి పొయ్యా.

చంద్రం భార్య... పద్మావతి... మహారాణిలా ఉంది - పట్టుచీరలూ, బంగారు నగలతో!

ఓసారి నన్ను చూసి పలకరింపుగా నవ్వింది... అంతే!

ఇవన్నీ గుర్తొచ్చాయి.... చంద్రం ఆటోలో దిగేసమయానికి.

♦ ♦ ♦

తెల్లటి జుత్తు. మాసిన గడ్డం. నలిగిపోయిన మరకలతో ఉన్న సిల్కు లాల్చీ, లుంగీతో రాజ్యభ్రష్టుడైన మాజీ రాజులా చంద్రం.

ఇన్నేళ్ళకు మా ఇంటికొచ్చిన చంద్రం... కొత్త అన్న భావన లేకుండా ఇల్లంతా కలియ

దిరిగి...

"మీ ఆవిడ...?"

"అమెరికా వెళ్ళింది... కూతురు పురిటికి"

"అయితే, ఒంటరివాడివన్నమాట. ఒకే" అన్న చంద్రం మా ఇంటిని యజమాని కొడుకులా వాడుకున్నాడు. నేను అతిథిగా చూస్తూ ఉండిపొయ్యా.

చెప్పాగా... చంద్రానికి చొరవ ఎక్కువని. రెండు మూడు రోజుల్లో తోమగా తోమగా చిలుము పట్టిన ఇత్తడి బొమ్మకు మెరుగు వచ్చినట్లు చంద్రం మామూలు మనిషి అయ్యాడు.

అడపాదడపా చంద్రం చెప్పిన విశేషాలు సేకరిస్తే..

♦ ♦ ♦

కొడుకు పెళ్ళయ్యాక భార్య పద్మావతి అమెరికా వెళ్ళి కొడుకు దగ్గిర సెటిలైంది.

"నువ్వూవెళ్ళకపోయావా?"

చంద్రం క్షణం ఆలోచించి, "వెడితే బాగుండేదేమో.. కాని, ఇక్కడ గీత ఉంది కదా!"

"గీత అంటే?"

"సినిమా వ్యాపారంలో నా కాళ్ళకు చుట్టుకున్న ఓ చిన్నపాటి నటీమణి. గీతకు నటించడం, నటిగా వృద్ధిలోకి రావాలన్న కోరికా, డబ్బున్న వాడిని పట్టుకుని బతకాలన్న యావ ఎక్కువ."

"ఆమె వలలో నువ్వు చిక్కావా?"

చంద్రం తల వంచుకున్నాడు.

"ఈ గీత కారణంగానే మొదటి భార్య పద్మావతి నిన్ను వదిలి కొడుకు దగ్గిర కెళ్ళిందా?"

చంద్రం తలెత్తలేదు.

"నీ ఆర్థిక దుస్థితికి గీతే కారణమా?"

చంద్రం చెప్పిన సమాధానం..

"ఒరేయ్! జోస్యం చెప్పిన బల్లి కుడితిలో పడ్డట్టు గీత నన్ను, నా ఆలోచనలను, ఆస్తిపాస్తుల్ని బంధించింది. నేను ఆమె ఆకర్షణలో పడి కీలుబొమ్మనైనా. ఈ విషయం తెలుసుకునేసరికి... చుట్టాలను, పరువునూ వదులుకుని నన్నే నమ్ముకుని, నా వెంట వచ్చిన పద్మ నాకు ఆస్తి, వ్యక్తిత్వమూ పద్మ... నన్ను వదిలేసింది. కొడుకు అమెరికాలో గ్రీన్‌కార్డ్ హోల్డర్. వాడికి తల్లంటే వల్లమాలిన అపేక్ష, అభిమానం. నేనంటే ఉపేక్ష.... నీకు తెలుసుగా. పద్మ కులం వేరు - నా కులం వేరు. కొడుక్కు పట్టుబట్టి తన కులం అమ్మాయితో పెళ్ళి జరిపించింది. ఇక ఆ ఇంట్లో నేను, నా స్థానం అస్థిరం. అందుకే పద్మతో వెళ్ళలేదు.

"ఇక గీత... చెప్పానుగా. నన్ను అన్నివిధాలా బంధించి వేసింది. ఇంకో విషయం చెప్పనా? పద్మ వయసులో నాకన్నా పెద్దది. జీవితంలో నిరాశా, నిస్పృహలతో ఉన్న

సమయంలో నా సాహచర్యం ఆమెలో కొత్త జీవం, జీవితంలో కొత్త అనుభవాలు పొంది నన్ను గుడ్డిగా నమ్మింది - నా వెంట వచ్చేలా చేసింది.

"గీత వయస్సులో నాకన్నా చాలా చిన్నది. ఆమె బతుకంతా ఆకలి, నిరాశా, అనిశ్చితమైన భవితవ్యం - అలా వరదలో కొట్టుకుపోతున్న గీతకు నేను దొరికా. అంతే.. .వచ్చిన అవకాశాన్ని చేజారిపోకుండా గట్టిగా వాటేసుకుని నన్ను తన బానిసలా చేసుకుంది"

"మరి నీ ఆస్తులు, సినిమాలు, బంగళా, కారు, పలుకుబడీ..."

"నన్నేం అడక్కు. ప్రస్తుతం నేను బికారిని. అన్నీ ఉన్నా అనుభవించే యోగ్యత, అధికారం లేవు. కొన్నాళ్ళు ఇక్కడే ఉంటా. ఆలోచించుకుని అడుగు ముందుకు వేస్తా."

అలా చంద్రం మా ఇంట తిష్ట వేశాడు. ఒంటరిగా ఉన్న నాకు తోడు, కాలక్షేపం.

రోజూ ఎక్కడికో వెళ్ళేవాడు. ఎవరెవరో వచ్చి వాడితో సంప్రదిస్తుండేవాళ్ళు. తన, పర అన్న భేదం లేకుండా డబ్బు నాదే ఖర్చు చేయసాగాడు. ఏదో బతికిచెడ్డవాడని ఏమీ అనలేక ఊరుకున్నా. ఓ రోజు నా పేర ఉత్తరం వచ్చింది.

"అన్నయ్యగారూ!

నా పేరు గీత. మీ మిత్రుడు చంద్రశేఖరం భార్యని. సినిమాల్లో వేషాలకని వచ్చిన నన్ను మభ్యపెట్టి, భ్రమపెట్టి లొంగదీసుకున్నాడు మీ మిత్రుడు. వ్రతం చెడ్డా ఫలం అయినా దక్కుతుందేమోనని... నటనకు స్వస్తి చెప్పి ఆయన ఇల్లాలుగా స్థిరపడ్డా. మీ మిత్రుడు మీ ఇంటికొచ్చాడని తెలిసి ఈ ఉత్తరం రాస్తున్నా.

అన్నయ్యగారూ.. ఆయనకు ఆస్తి, డబ్బూ అన్నీ ఉన్నాయి. మీకు తాను బికారినని చెప్పి ఉంటాడు కదూ. అంతా కల్పన! ఆయనకు ఇంకా ఏదో కావాలి. ఏం కావాలో తెలియదు.

అందుకే మీ లాంటి వారి దగ్గరకు చేరి నా పై లేనిపోని నిందలు మోపి, తాను సానుభూతి పొందుతుంటాడు. ఇన్నాళ్లూ, సినిమాల్లో తిరిగాడు కదా... ఆ అనుభవంతో మీలాంటి వాళ్ళను నమ్మిస్తుంటాడు. స్వేచ్ఛాజీవితం కావాలి ఆయనకు. సానుభూతి కావాలి. తనెంతగా నష్టపొయ్యాడో కథలుగా చెబుతూ, మీలాంటి వారి నుంచీ జాలీ, ప్రేమా, అనునయం పొందడం.. ఆయనకు హాబీ. అంతేకాదు - జబ్బు కూడా!

ఈ హాబీ వల్ల ఆయన పొందే ఆనందం మీలాంటివారికి నష్టం. అంతేకాదు ఆర్థికంగా భారం కూడా. మీ ఇష్టం. ఏం చేసినా సరే.. ఆయన మాట, చేసే అభినయం అంతా కల్పన, నటన. ఓ రకమైన జబ్బు... మానసికంగా. జాగ్రత్త ఉంటా....

మీ చెల్లెలు గీత.."

ఉత్తరం చదివి ఆశ్చర్యపొయ్యా. చంద్రం నటిస్తున్నాడా? ఏమో! ఈ ప్రియమైన శత్రువుని వదిలించుకోవాలి - తప్పదు. ఎలాగా? అదే తోచడంలా. ●